# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి.

- ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

- విశాఖ, తిరుపతి నగరాల్లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కందుల దుర్గేశ్ తెలియజేశారు.

========================

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడానికి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభలో ఈరోజు ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మౌలిక వసతులు పెంచేందుకు గతంలో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానం తీసుకువచ్చామని, ఇప్పుడు ప్రజల్ని కూడా అందులో జోడించి ఉగాదికి కొత్తగా పీ4 విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు. పేదరికంలో ఉన్న 30 లక్షల కుటుంబాలను ఆర్థికంగా పురోగతి సాధించినవారు దత్తత తీసుకునే ఏర్పాట్లు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమయిన 16వ శాసన సభ మూడవ సమావేశాలు 2025-26 ఆర్థిక స్వంవత్సరానికి గానూ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై చర్చలతో 15 రోజుల పాటూ కొనసాగాయి. మొత్తం 85 గంటల పాటూ సభా కార్యకలాపాలు జరిగాయని, 113 నక్షత్రగుర్తు ప్రశ్నలను సభ్యులు

ప్రస్తావించారని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు వెల్లడించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 9 బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయని సభాపతి తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

బుడగజంగం కులాన్ని షెడ్యూల్డ్ కులాల్లో చేర్చాలంటూ చేసిన తీర్మానానికి ఆంధ్రప్రదేశ్ చట్ట సభలు నుండి ఈరోజు ఆమోదం లభించింది. శాసనసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈరోజు ముఖ్యమంత్రి శాసనసభలో మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని గతంలో చెప్పినట్లుగా ఆ మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. జిల్లాల వారీగా కేటగిరి విభజన చేయాల్సి ఉంటుందని.. జనగణన పూర్తి అయిన తరువాత మరోసారి జిల్లాల వారీగా కేటగిరిల విభజన చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు.

========================

విశాఖ, తిరుపతి నగరాల్లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలియజేశారు. ఈరోజు శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ... విశాఖలో సినీపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. త్వరలో సినీ ప్రముఖులతో చర్చించి స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి కందుల దుర్గేశ్ తెలియజేస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

========================

వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఎర్త్ అవర్ గ్లోబల్ ఉద్యమంలో భాగంగా ఈనెల 22వ తేదీ రాత్రి 8 గంటల 30 నిమిషాల నుంచి 9 గంటల 30 నిమిషాల వరకు ఒక గంట పాటు 'ఎర్త్ అవర్' పాటించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఒక గంట పాటు అనవసరమైన లైట్లను స్వచ్ఛందంగా నిలిపి వేయడం ద్వారా.. వాతావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలను ఏకం చేస్తూ.. భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని అందించడంలో ఎర్త్ అవర్ ప్రచారం ప్రపంచ వ్యాప్తంగా సహాయపడుతుందని గవర్నర్ తెలిపారు.

విరామం

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పులపై ప్రభుత్వం స్పష్టమైన సమాచారం అందించట్లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. శాసన మండలిలో ఈరోజు ఆయన మాట్లాడుతూ... అప్పులకి సంబంధించి ప్రభుత్వం ఒక్కోసారి ఒక్కో విధంగా చెబుతోందని పేర్కొన్నారు. దీనికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ... రాష్ట్ర అప్పులపై ఇప్పటికే శ్వేత పత్రం విడుదల చేశామని తెలిపారు. ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని చెప్పారు.

========================

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలో గత మూడు నెలల కాలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీసులు ఈరోజు నిర్వీర్యం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం పోలీస్ రేంజ్ డిఐజీ గోపీనాథ్ జట్టి సమక్షంలో మూడు జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పట్టుబడిన గంజాయిని ఈరోజు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో ఉన్న రెయిన్ బో పరిశ్రమ వద్ద  శాస్త్రీయ పద్ధతిలో కాల్చివేశారు. అనంతరం డిఐజీ గోపీనాథ్ జట్టి పాత్రికేయులతో మాట్లాడుతూ... గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తయారు చేయాలనే దిశగా గత 8 నెలల

కాలంలో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో విస్తృతంగా దాడులు, తనిఖీలు చేసి 32 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. 2050 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో గంజాయి పంట సాగు అవుతున్న దృష్ట్యా అక్కడ రైతులకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకున్నామని డిఐజీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవుల భర్తీకి రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. కడప జడ్పీ ఛైర్ పర్సన్, కర్నూలు జడ్పీ కో-ఆప్టెడ్ సభ్యులు, 28ఎంపీపీలు, 23 వైస్ ఎంపీపీలు, మండల ప్రజా పరిషత్ లో 12 మంది కో- ఆప్టెడ్ సభ్యులు, 214 మంది ఉపసర్పంచుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 27వ తేదీన ఈ ఎన్నికలు జరగనున్నాయి.

=========================

ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతోందంటే దానికి కారణం మందకృష్ణ మాదిగ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. ఈరోజు శాసన సభలో ఎస్సీ వర్గీకరణపై ఆయన మాట్లాడుతూ... మందకృష్ణ గుండె ధైర్యం కలిగిన వ్యక్తి అని ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై అనేక చర్చలు జరిగాయని రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

=========================

భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి ఏ. సోమేశ్వరరావు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ నుండి ఏప్రిల్ 10వ తేదీ వరకు www.joinindianarmy.nic.in వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వారి అడ్మిట్ కార్డును డౌన్ లోడ్ చేసుకోవడం ద్వారా ఆర్మీ ర్యాలీ వివరాలను పొందవచ్చని తెలియజేశారు.

=========================

నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఈరోజు కలెక్టరేట్ నుండి నాటు సారా నివారణపై రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్ అధికారులతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అక్రమ నాటు సారా తయారీదారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సూచించారు.

=========================
=========================